https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 76 బుధవారం 22-07-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను


మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

# నేడు ఢిల్లీకి సీఎం

- మోదీ, అమిత్‌షాతో భేటీ డీలిమిటేషన్, మహిళా బిల్లులపై చర్చలు
- వీటిపై ప్రాంతీయ పార్టీలతో సమన్వయం చేసుకునే బాధ్యత చంద్రబాబుకు అప్పగింత
- దీనిపై చర్చించడానికే హస్తిన పర్యటన
- కేంద్ర మంత్రివర్గ విస్తరణపైనా మంతనాలు!



**అమరావతి, జూలై 21**
ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ఢిల్లీ వెళ్తున్నారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షాతో సమావేశం కానున్నారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులను ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో మళ్లీ తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రతిష్ఠాత్మకమైన ఈ బిల్లులను ఈసారి ఎలాగైనా ఆమోదింపజేసుకోవాలని బీజేపీ పెద్దలు పట్టుదలతో ఉన్నారు. ఇందుకు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ సాధనపై దృష్టి కేంద్రీకరించారు. ఇందులో భాగంగా ప్రాంతీయ పార్టీలను సమన్వయం చేసే బాధ్యతను చంద్రబాబుకు అప్పగించారు. దీనిపై చర్చించేందుకే ఢిల్లీ పెద్దల ఆహ్వానంపై ఆయన ఢిల్లీ వెళ్తున్నారు. కేంద్ర మంత్రివర్గ విస్తరణపైనా చర్చ జరిగే అవకాశం ఉంది. ప్రధానితో భేటీ సందర్భంగా ఆగస్టు 1న భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ఆయన్ను సీఎం ఆహ్వానిస్తారు. బుధవారం ఉదయం 7.50కు గన్నవరం విమానాశ్రయం నుంచి చంద్రబాబు ఢిల్లీ బయల్దేరతారు. అక్కడకు చేరుకున్నాక నేరుగా పార్లమెంటు భవనానికి వెళ్తారు. తన పర్యటనలో ప్రధానిని, అమిత్‌షాను మాత్రమే గాక.. పీయూష్ గోయల్, మనోహర్‌లాల్ ఖట్టర్, సీఆర్ పాటిల్ సహా పలువురు కేంద్ర మంత్రులను కూడా ఆయన కలిసే అవకాశముంది. రాత్రికి అక్కడే బస చేస్తారు. గురువారం ఉదయం 10.20కి అమరావతి తిరిగి బయల్దేరతారు.

## సుప్రీంకోర్టును ఆశ్రయించిన శివసేన (యూబీటీ)



**ఢిల్లీ, జులై 21 :**
లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయంపై సుప్రీంకోర్టును (రాబజూతీవఎవ జశీబతీ) ఉద్ధవ్ వర్గం ఆశ్రయించింది. షిండే వర్గంలో ఆరుగురు లోక్‌సభ ఎంపీల విలీనానికి లోక్‌సభ స్పీకర్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో అత్యవసర పిటిషన్‌ను ఉద్ధవ్ ఠాక్రే వర్గం వేసింది. ఉద్ధవ్ వర్గం పిటిషన్‌ను విచారించేందుకు సమ్మతిని పరిశీలిస్తామని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం వెల్లడించింది. ఈ విలీనాన్ని ఆమోదిస్తూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఉద్ధవ్ వర్గం విజ్ఞప్తి చేసింది. లోక్‌సభ వర్షాకాల సమావేశాలకు ముందే ఎంపీల విలీనానికి స్పీకర్ ఓం బిర్లా ఆమోదం తెలిపారు. ఎంపీల విలీనంతో లోక్‌సభలో 13 మందికి షిండే వర్గం శివసేన బలం పెరిగింది. కేవలం మూడు స్థానాలకు ఉద్ధవ్ ఠాక్రే (ఖదీ) పార్టీ ఎంపీల సంఖ్య పడిపోయింది. ఎవరికి వ్యతిరేకంగా గెలిచారో వారితోనే విలీనమవడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టులో ఉద్ధవ్ వర్గం వాదనలు వినిపించింది.

# పనిని నిర్లక్ష్యం చేస్తే వేటే..!

## మార్చికల్లా ఎడ్యుకేషన్ హబ్ పూర్తి కావాలి

- కాంట్రాక్టర్లు నెలవారీ లక్ష్యంతో పనిచేయాలి
- తెలిసిన వారైనా అలసత్వాన్ని ఉపేక్షించను
- అనుకున్నట్లు చేయకుంటే సిబ్బంది సస్పెన్షనే
- హబ్ అద్భుతమని చెప్పాం.. ఇక్కడేం లేదు
- కొడంగల్ హబ్ పనులపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి
- శనివారం లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశం



**వికారాబాద్,జూలై 21:**
కొడంగల్ నియోజకవర్గంలో తాను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎడ్యుకేషనల్ హబ్‌లోని వివిధ విద్యాసంస్థల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ముందు అనుకున్న డెడ్‌లైన్ ప్రకారం 2027 మార్చి కల్లా హబ్‌లోని విద్యాసంస్థల నిర్మాణం పూర్తి కావాల్సిందేనని స్పష్టం చేశారు. అందుకు తగిన విధంగా నెలవారీ లక్ష్యాలు నిర్ణయించుకొని పని చేయాలని ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా పని చేయని వారెవరినైనా వెంటనే సస్పెండ్ చేయాలని ఉన్నతాధికారులకు చెప్పారు. మంగళవారం ఆయన హకీంపేట ఎడ్యుకేషనల్ హబ్‌లో వివిధ విద్యా సంస్థల నిర్మాణ పనులను పరిశీలించారు. యంగ్ ఇండియా, ఇంజనీరింగ్, వెటర్నరీ, మెడికల్, నర్సింగ్, పారామెడికల్, ఫిజియోథెరపీ కళాశాలల భవన నిర్మాణ పనులను దగ్గరకు వెళ్లి పరిశీలించారు. పనులు నత్తనడకన సాగడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇక మీదట మరో లెక్క. అనుకున్న పని జరగకపోతే ఊరుకోను" అన్నారు. కాగితాలపై నివేదికలు చూపిస్తే సరిపోదని, క్షేత్ర స్థాయిలో ఫలితాలు కనిపించాలని స్పష్టం చేశారు. అధికారులు, కాంట్రాక్టర్లు తనకు తెలిసిన వారైనా పని చేయకపోతే ఫలితం అనుభవించక తప్పదని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఇరవై ఏళ్లుగా ప్రజాజీవితంలో ఉన్నానని, దొంగలెవరో, దొరలెవరో ఇట్టే కనిపెట్టేస్తానని చెప్పారు.

మిగతా 2లో...

## హైదరాబాద్‌లో కొవిడ్ కేసులు?

2 కొద్దిరోజుల క్రితం గాంధీలో కరోనా కేసు నమోదు!

## తాగిన మత్తులో రాశానేమో?

2 సూసైడ్ నోట్‌పై వైద్యులతో చెప్పిన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి

# రాహుల్ ధర్నాపై రాజకీయ దుమారం!

- ఇది బీజేపీ, కాంగ్రెస్ మ్యాచ్ ఫిక్సింగేనన్న ఆప్ - తమను రాజకీయ రొచ్చులోకి లాగొద్దన్న సీజేపీ



**న్యూఢిల్లీ, జూలై 21:**
కాక్రోచ్ జనతా పార్టీ 'సంసద్ చలో' కార్యక్రమాన్ని ఢిల్లీ పోలీసులు ఉక్కుపాదంతో అణచివేసిన మర్నాడే ప్రధాని ఇంటి సమీపంలో రాహుల్‌గాంధీ ధర్నా చేసిన సంఘటన తీవ్ర రాజకీయ దుమారానికి కారణమైంది. ఢిల్లీలో ప్రధాన పార్టీలైన ఆమ్‌ఆద్మీ పార్టీ, కాంగ్రెస్, బీజేపీల మధ్య పరస్పర ఆరోపణలకు వేదికైంది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాయని, సీజేపీ ఉద్యమాన్ని బలహీనం చేసేందుకు మోదీ పంపిస్తేనే రాహుల్‌గాంధీ వచ్చి ధర్నాకు కూర్చున్నారని ఆప్ ఆరోపించింది. వాంగ్‌చుక్ సీజేపీతో కలిసి నెల రోజులుగా ధర్నా చేస్తున్నా కేంద్రం పట్టించుకోలేదని గుర్తు చేసింది. రాహుల్ ఏకంగా ప్రధాని ఇంటి ఎదుటే ధర్నా చేయగలిగారని చెప్పింది. ఆయన ధర్నాకు కూర్చున్న గంటలోనే ప్రభుత్వం చర్చలకు రావడం కాంగ్రెస్, బీజేపీల మధ్య జుగల్బందీని తలపిస్తోందని ఆప్ నేత, ఢిల్లీ మాజీ సీఎం ఆతిషి అన్నారు. మరోవైపు, విద్యార్థులపై...

మిగతా 2లో...

# నీట్ పేపర్ లీక్ మహాపాపం


- పిల్లలను రెచ్చగొట్టడం సరికాదు
- పేపర్ లీక్ బాధ్యులను అత్యంత కఠినంగా శిక్షిస్తాం
- ప్రశ్నప్రత్రాల లీకేజీలు నివారించడం జాతీయ బాధ్యత
- పార్లమెంట్‌లో నిర్మాణాత్మక చర్చలకు విపక్షాలు సహకరించాలి
- ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, జూలై 21:**
నీట్ ప్రశ్నపత్రం లీకేజీ అత్యంత ఘోరమని, మహాపాపమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు నీట్ ప్రశ్నపత్రం లీకేజీ బాధ్యులను ప్రభుత్వం ఇప్పటికే కటకటాల్లోకి నెట్టిందని తెలిపారు. నిరసనలు చేపడుతున్న పిల్లలను రెచ్చగొట్టవద్దని, యువతను సరైన మార్గంలో నడిపించే అంశంలో

మిగతా 2లో...

## ఢిల్లీలో అగ్నిప్రమాదం... ముగ్గురి మృతి



**ఢిల్లీ, జులై 21**
ఢిల్లీలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. బీకేదత్ కాలనీలోని ఓ నివాస గృహంలో మంగళవారం అగ్నిప్రమాదం సంభవి ంచింది. ఈ ఘటనలో ఓ మహిళతో పాటు ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. ఈ ప్రమాదం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే అప్పటికే ఇంట్లో చిక్కుకున్న మహిళ, ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. అగ్నిప్రమాదం ఎలా జరిగింది, షార్ట్ సర్క్యూట్ కారణమా.? లేదా ఇతర కారణాలున్నాయా.? అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటన సమయంలో ఇంట్లో మరెవరైనా ఉన్నారా.? అనే విషయాన్ని కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ దుర్ఘటనపై స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

# 'ఇందిరమ్మ ఇళ్ల'తో సర్కారు కొత్త నాటకం!

- జీహెచ్‌ఎంసీ ఎన్నికల నేపథ్యంలోనే..
- లక్షలాది మంది అర్హులుంటే 7 వేల ఫ్లాట్లకే నోటిఫికేషనా? - ఇందిరమ్మ ఇళ్ల పేరుతో దోపిడీ
- గతంలో నిర్మించిన ఇళ్లు అర్హులకు ఇవ్వాలి - బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



**హైదరాబాద్, జూలై 21:**
జీహెచ్‌ఎంసీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరో నాటకానికి తెరతీసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఆరోపించారు. సర్కారు ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం 'ఆర్థిక దోపిడీ' అని విమర్శించారు. గతంలో నిర్మించిన ఇళ్లను అర్హులైన పేదలకు ఉచితంగా కేటాయించాలని, పాత ఇళ్లు పంపిణీ కాకపోవడంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ(క్యూర్) పరిధిలో 24 నియోజకవర్గాల్లో లక్షలాది మంది అర్హులు ఉంటే, కేవలం 7,680 ఫ్లాట్లకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారని.. ఒక్కో దరఖాస్తుదారుడి నుంచి రూ.100 రుసుముతో పాటు రూ.10 వేలు ఈఎండీ వసూలు చేయడం దారుణమని విమర్శించారు.

మిగతా 2లో...

# పనిని నిర్లక్ష్యం... (మొదటిపేజీ తరువాయి)

సకాలంలో పని జరగకపోతే తనకు తెలిసిన వారు తెలవని వారి కిందే లెక్క అని వ్యాఖ్యానించారు. ఎడ్యుకేషనల్ హబ్‌ను ఓ పెద్ద అద్భుతంగా చెప్పుకున్నామని, క్షేత్ర స్థాయిలోఆ పరిస్థితి ఏమీ కనబడటం లేదని మండిపడ్డారు. హబ్‌లో జరిగే పనులను పర్యవేక్షించి, ఫలితాలు ఇవ్వాల్సిన బాధ్యత కాంట్రాక్టర్లు, అధికారులదని, ఏ నెలలో ఎంత పని చేస్తారో షెడ్యూల్ వేసుకొని పనులు చేపట్టాలని, ఎంత డబ్బు అవసరమో తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ప్రతీ నెలా పురోగతిని ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని స్పష్టం చేశారు. ఖర్చుకు సంబంధించిన పుస్తకంలో నమోదు చేయకుండా పనులు జోరుగా జరుగుతున్నాయని చెబితే నమ్మేంత అమాయకుడిని కాదని, ఎన్ని టోకెట్లు వచ్చాయో చూస్తే పనుల పురోగతి ఇట్టే అర్థం అవుతుందని వ్యాఖ్యానించారు. హబ్‌లోని ఒక్కో ప్రాజెక్టుకు సంబంధించి నెలవారీ కార్యాచరణను సిద్ధం చేయాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఉన్నతాధికారులకు సూచించారు. ప్రతి ప్రాజెక్టుపై కాంట్రాక్టర్లు, ఇంజనీర్లతో సమావేశాలు నిర్వహించాలని, డ్రాయింగ్స్ లేదా ఇతర అనుమతుల వల్ల జాప్యం ఉంటే వెంటనే పరిష్కరించాలని చెప్పారు. హబ్‌లో జరుగుతున్న అన్ని పనులపై పూర్తి స్థాయి నివేదికను శనివారంలోగా తనకు అందజేయాలని స్పష్టం చేశారు. భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్ల కేటాయింపులో జాప్యంపైనా ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంలోగా లబ్దిదారులకు లాటరీ తీసి ప్లాట్ల పట్టాలు అందజేయాలని చెప్పారు.

# హైదరాబాద్‌లో కొవిడ్ కేసులు?

**కొద్దిరోజుల క్రితం గాంధీలో కరోనా కేసు నమోదు!**


**గత నెలలో తార్నాకలో కొవిడ్‌తో మహిళ మృతి!**

**టెస్టులు చేయకపోవడం వల్లనే 'సున్నా' కేసులు**

**పరీక్ష చేయడానికి కిట్లే లేవంటున్న వైద్యవర్గాలు**

హైదరాబాద్, జూలై 21

దేశవ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతున్నాయి. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో కూడా కొవిడ్ కేసులొస్తున్నాయి. ఇప్పటికే ఆ రాష్ట్రంలో కరోనా కారణంగా నలుగురు మృత్యువాత పడ్డారు. హైదరాబాద్ నగరంలోనూ గత నెల రోజులుగా జలుబు, జ్వరం, దగ్గు, ఒళ్లునొప్పులతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చేవారి సంఖ్య పెరుగుతున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. ఇటువంటి అనుమానిత కేసుల్లో పరీక్షలు చేస్తే కొందరికైనా కొవిడ్ పాజిటివ్ వచ్చే ఆస్కారం ఉంటుంది. కానీ, అటు సర్కారీ దవాఖానాల్లోనూ, ఇటు ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ టెస్టులు చేయకపోవడంతో కొవిడ్ కేసులున్నా నిర్ధారణ కావడం లేదని సమాచారం. అందుకే రాష్ట్రంలో కొవిడ్ కేసులు 'సున్నా' అని ప్రజారోగ్య విభాగం రిపోర్టు చేస్తున్నట్టు చెబుతున్నారు. కిందటి నెల మొదటి వారంలో తార్నాకకు చెందిన 38 ఏళ్ల మహిళ జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతూ సీటీ చెస్ట్ స్కాన్ చేయించుకోగా.. ఆమె ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిన్నట్టు వచ్చింది. ఒక కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లిన కొన్నిగంటలకే ఆమె మరణించారు. అనంతరం ఆమె రిపోర్టును పరిశీలించిన ఓ ప్రభుత్వ వైద్యుడు.. కొవిడ్ కారణంగా ఆమె ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. అలాగే గత నెల్లో గాంధీలో కూడా ఒక కొవిడ్ కేసు నమోదైనట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా.. తెలంగాణలో కొవిడ్ నిర్ధారణ పరీక్షలకు సంబంధించి ప్రజారోగ్య విభాగం ఎలాంటి ఆదేశాలూ జారీ చేయలేదు. టెస్టు కిట్లు లేకపోవడం వల్లే కొవిడ్ పరీక్షలు చేయట్లేదని వైద్యవర్గాలు చెబుతున్నాయి. కొవిడ్ తీవ్రత లేకపోవడంతో నాలుగేళ్లుగా కిట్లు, మాస్కులు, శానిటైజర్స్ కొనుగోలు చేయడాన్ని తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు, మౌలికసదుపాయాల అభివృద్ధి సంస్థ(టీజీఎంఎ?సఐడీసీ) పూర్తిగా నిలిపివేసింది. దీంతో.. ఒకవేళ వైరస్ విజృంభించి భారీగా కేసులొస్తే, పూర్తిగా చేతులెత్తేసే పరిస్థితి. అలాగే కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో కనీస జాగ్రత్తలు, అవగాహన కల్పించడంలో ప్రజారోగ్య సంచాలకుల విభాగం పూర్తిగా



విఫలమైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## నిద్రపోతున్న ఐడీఎస్‌పీ

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ (ఐసీఎంఆర్) ప్రతివారం దేశవ్యాప్తంగా రెస్పిరేటివ్ వైరస్ సరళిపై టెస్టులు చేస్తుంటుంది. జూన్ మొదటివారం నుంచి దేశవ్యాప్తంగా కొవిడ్ కేసులు పెరుగుతున్నట్లు అందులో వెల్లడైంది. తాజాగా జూలై మొదటివారంలో ఆ సంస్థ 162 నమూనాలను పరీక్షించగా.. 58 కొవిడ్ కేసులు నమోదు అయినట్లు వెల్లడించింది. మిగతావన్నీ కూడా ఇన్‌ఫ్లూయెంజా కేసులని పేర్కొంది. ఇదే విషయాన్ని ఐసీఎంఆర్ తన డ్యాష్‌బోర్డ్‌లో కూడా వెల్లడించింది. రాష్ట్రాల్లో వైరసలు, ఇతర అంటువ్యాధుల వ్యాప్తిని ముందుగా అంచనా వేసి, తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకుల విభాగానిదే. ఈ బాధ్యతను ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రొగ్రామ్(ఐడీఎ?సపీ) విభాగం చూసుకుంటుంది. కానీ రాష్ట్రంలో ఐడీఎ?సపీ విభాగం పూర్తిగా నిద్రపోతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో.. రాష్ట్రంలో, హైదరాబాద్‌లో కొవిడ్ కేసులు, వైరస్ వ్యాప్తి, వైద్యశాఖ చేపట్టిన చర్యలు, టెస్టులపై వివరణ కోరేందుకు రాష్ట్ర ఐడీఎ?సపీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బాలాజీ రెడ్డిని వివరణ కోరేందుకు ఫోన్ ద్వారా 'ఆంధ్రజ్యోతి' పలుమార్లు సంప్రదించినా ఆయన అందుబాటులోకి రాలేదు. అలాగే హైదరాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సైతం ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

# తాగిన మత్తులో రాశానేమో?

**సూసైడ్ నోట్‌పై వైద్యులతో చెప్పిన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి**


**ఆమె, నేను ప్రేమించుకున్నాం.. చాలా కాలం సన్నిహితంగా మెలిగాం**


**ఆమెకు పెళ్లైనా, నాపై ఇష్టం ఉందంటూ వచ్చింది.. కాదన్నందుకు కక్షతోనే తప్పుడు ఆరోపణలు**

**పోలీసులు సరిగ్గా పరిశీలించకుండానే ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు.. దాన్ని కొట్టివేయండి**

**హైకోర్టును ఆశ్రయించిన ఉదయ్ కృష్ణారెడ్డి**

**అతిగా మద్యం తాగడంతోనే అపస్మారక స్థితిలోకి.. ఉదయ్ శరీరంలో విషపదార్థాల్లేవు: వైద్యులు**






హైదరాబాద్, జూలై 21

జాతీయ పోలీసు అకాడమీలో లైంగిక వేధింపుల ఆరోపణల వ్యవహారం మరిన్ని మలుపులు తిరుగుతోంది. వేధింపుల కేసు నేపథ్యంలో.. ఆత్మహత్యాయత్నం చేసినట్టు ప్రచారం జరిగిన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి శరీరంలో ఎలాంటి విషపదార్థాల జాడ లేదని వైద్యులు తెలిపారు. రక్తపరీక్షల్లో ఆల్కాహాల్ మాత్రమే గుర్తించామని, ఆయన ఆహారం తీసుకోకుండా అతిగా మద్యం తాగడం వల్లే స్పృహకోల్పోయి ఉంటారని నిర్ధారణకు వచ్చామని చెప్పారు. జయంతి ఆస్పత్రి వైద్యుడు రవిశంకర్‌రెడ్డి మంగళవారం మధ్యాహ్నం ఈ వివరాలు వెల్లడించారు. ఉదయ్ కృష్ణారెడ్డి స్పృహలోకి వచ్చారని, ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉందన్నారు. ఉదయ్ కృష్ణారెడ్డితో మాట్లాడామన్నారు. ఆయన ఎలాంటి ఆత్మహత్యాయత్నం చేయలేదని, సూసైడ్ నోట్ రాసినట్టు తనకు గుర్తులేదని, మద్యం మత్తులో రాసి ఉండవచ్చేమోనని చెబుతున్నారని వివరించారు.

## నాపై కేసును కొట్టివేయండి..

ఫిర్యాదు చేసిన ట్రైనీ మహిళా ఐపీఎస్, తాను చాలా రోజుల నుంచి ప్రేమించుకుంటున్నామని.. తమ మధ్య ఉన్న సన్నిహిత సంబంధం విషయంలో ఇబ్బందులతోనే ఆమె తప్పుడు ఆరోపణలు చేశారంటూ ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. పోలీసులు ప్రాథమిక పరిశీలన ఏదీ చేయకుండానే ఎఫ్ఐఆర్ దాఖలు చేశారని, దానిని కొట్టివేయాలని అభ్యర్థించారు. ఇక ఉదయ్ కృష్ణారెడ్డి ఎలాంటి ఆత్మహత్యాయత్నం చేయలేదని.. అతిగా మద్యం తాగడంతోనే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారని వెల్లడైంది. అంతేకాదు.. తాను మద్యం మత్తులో సూసైడ్ నోట్ రాసి ఉండొచ్చని ఉదయ్ చెబుతున్నారని ఆయన చికిత్స పొందుతున్న ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. ఇక పరస్పర ఆరోపణల నేపథ్యంలో ఉదయ్ కృష్ణారెడ్డి ఫోన్‌ను పరిశీలిస్తే.. అసలు సంగతి బయటపడుతుందని పోలీసు అధికారులు చెబుతున్నారు.

## మేం పెళ్లి చేసుకుందామనుకున్నాం!

ట్రైనీ మహిళా ఐపీఎస్‌ను లైంగికంగా వేధించిన ఆరోపణలతో తనపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ ఉదయ్ కృష్ణారెడ్డి మంగళవారం హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. "ఫిర్యాదు చేసిన ట్రైనీ మహిళా ఐపీఎస్, నేను ముస్సోరిలో శిక్షణ సమయంలో ఒకరికొకరు ప్రేమించుకున్నాం. మానసికంగా, శారీరకంగా సన్నిహితంగా మెలిగాం. పోలీస్ అకాడమీలో సైతం ఇది కొనసాగింది. సర్వీసులో చేరాక వివాహం చేసుకోవాలనుకున్నాం. కాబోయే భార్య అనే విశ్వాసంతో ఆమెకు ఆర్థికంగా చాలా సహాయం చేశాను. కానీ నాకు మరో మహిళతో సంబంధమున్నట్టు ఆమె అనుమానం పెంచుకుంది. ఈ క్రమంలో ఈ ఏడాది మేలో ఒక ఐఏఎస్ అధికారిని వివాహం చేసుకుంది. తర్వాత నాకు మరే మహిళతో సంబంధం లేదనే విషయం అర్థమైందంటూ, నేనంటే ఇప్పటికీ ఇష్టమంటూ పోలీస్ అకాడమీలో నా గదికి వచ్చింది. కానీ ఆమెకు వివాహం కావడంతో నేను తిరస్కరించాను. వేరే అమ్మాయిని పెళ్లిచేసుకుంటానని చెప్పాను. అయినా ఆమె తరచూ ఫోన్ చేస్తూ, నా గదికి వస్తూ ఉండేది. ఈ విషయం ఆమె భర్తకు తెలియడంతో నిలదీశారు. దీనితో నేనే ఆమెను వేధిస్తున్నట్టు భర్తకు చెప్పింది. ఆమె భర్త నాకు ఫోన్ చేసి అడగడంతో.. మా అనుబంధం గురించి వివరించాను. కానీ ఆయన నాదే తప్పు అని వాదించడంతో.. నిజాయతీ నిరూపించుకునేందుకు ఆమె, నేను కలిసి ఉన్న ఒక వీడియోను పంపాను. అది చూసి ఆమె భర్త గొడవ పెట్టుకున్నారు. ఆమె నాపై ప్రతీకారంతో పోలీస్ అకాడమీ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. తర్వాత తప్పుడు ఆరోపణలతో పోలీసులకు ఫిర్యాదు చేసింది" అని పిటిషన్‌లో ఉదయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు తన వద్ద ఉన్న అన్ని ఆధారాలు, వీడియోలు కోర్టుకు సమర్పిస్తున్నానని పేర్కొన్నారు. ఈ పిటిషన్ త్వరలో హైకోర్టు ఎదుట విచారణకు రానుంది.

## వారి ఫోన్లలోనే గుట్టు!

తనకు అసభ్య సందేశాలు పంపుతూ, లైంగికంగా వేధించారని ట్రైనీ మహిళా ఐపీఎస్ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఉదయ్ కృష్ణారెడ్డి ఐఫోన్‌ను, బాధితురాలి ఫోన్‌ను పరిశీలిస్తే.. వ్యవహారం ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంటుందని పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఉదయ్ కృష్ణారెడ్డి ఆస్పత్రిలో ఉండటంతో ఆయన ఫోన్ ఎక్కడుందనేది తెలియలేదని అంటున్నాయి.

### నిజాంపేట్ ప్రజల 'సర్' సమస్యల పరిష్కారం కొరకే

## హెల్ప్ డెస్క్ ల ఏర్పాటు : కోటపాటి మురళి




నిజాంపేట్ జులై 22

నిజాంపేట్ డివిజన్ లో కాంగ్రెస్ అధ్యక్షులు కోటపాటి మురళి ఆధ్వర్యంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కడియాల ఇందిరల సహకారంతో డివిజన్ లో పలు చోట్ల హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూస్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో స్థానిక ప్రజల ఏనుమరేషన్ ఫారంలను ఇవ్వడానికి తీసుకోవడానికి స్థానిక బి ఎల్ ఓ ల సహకారం తో నిజాంపేట్ డివిజన్ లో గత 16 రోజులు గా సేవలందిస్తున్నట్టు తెలిపారు. సర్ గడువు ముగియడానికి సమయం దగ్గరపడుతున్నందున ప్రజలు ఈ హెల్ప్ డెస్క్ ల సహకారంతో ఏనుమరేషన్ ఫారాలు పూరించి ఇచ్చి తమ ఓటును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

# రాహుల్ ధర్నాపై..

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం దౌర్జన్యం గురించి నిలదీయడానికే తాము ప్రధాని నివాసం వద్దకు వచ్చామని రాహుల్‌గాంధీ ప్రకటించారు. నీట్‌పై ప్రభుత్వంలో జవాబుదారీతనం కొరవడటం, కనీసం పార్లమెంటులో చర్చించేందుకు నిరాకరిం చడం వల్లే తాము ధర్నాకు దిగాల్సి వచ్చిందన్నారు. బీజేపీ కూడా ఆప్‌ను పట్టించుకోకుండా మాట్లాడింది కానీ పరోక్షంగా ఆప్ ఆరోపణలకు సమాధానం ఇచ్చింది. రాహుల్‌గాంధీ మొదట పార్లమెంటులో నీట్‌పై చర్చను డిమాండ్ చేశారని, ధర్నా దగ్గరకు వచ్చి నీట్‌పై చర్చకు సిద్ధమని తాము చెప్పగానే ఆయన మాట మార్చి విద్యామంత్రి రాజీనామాను కోరుతున్నారని మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు. పరోక్షంగా తమకు, కాంగట?స్రకు మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ లేదని చెప్పారు. మరోపక్క కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులు కేంద్రమంత్రి నడ్డాతో సమావేశమై విద్యా సంస్కరణలపై చర్చించారు. విద్యామంత్రి రాజీనామాకు డిమాండ్ చేశారు. ఇదే సందర్భంగా తమకు కాంగ్రెస్ సహా ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని ప్రకటించారు. పరోక్షంగా సీజేపీ నేతలు ఈ రాజకీయ రొచ్చులో తమను దింపొద్దని కాంగ్రెస్, ఆప్‌లకు సందేశమిచ్చారు. ఒకప్పటి మాతృ సంస్థ ఆప్‌కు తనకు సంబంధం లేదని దీప్కే ఈ ప్రకటన ద్వారా తేల్చిచెప్పారు.


# 'ఇందిరమ్మ ఇళ్ల'తో..

(మొదటిపేజీ తరువాయి)

వీటికి మరమ్మతులు చేసి పేదలకు ఇవ్వకపోవడం కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనం. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన' కింద ఇస్తున్న నిధులు, సబ్సిడీలను వాడుకుంటూ, రూ.11 లక్షలకు ఇల్లు ఇస్తున్నామని కాంగ్రెస్ సర్కారు ప్రచారం చేసుకోవడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే" అని స్పష్టం చేశారు.

# నీట్ పేపర్ లీక్..

(మొదటిపేజీ తరువాయి)




సమాజం బాధ్యతాయు తంగా వ్యవహరించాలని కోరారు. లీకేజీ బా ధ్యులను అత్యంత కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీ సమస్యను నివా రించేందుకు పార్టీలకతీతం గా అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు కేంద్రంతో కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రశ్నపత్రాల లీకేజీలను నివారించడమనేది రాజకీయ అంశం కాదని జాతీయ బాధ్యత అని పేర్కొన్నారు. మంగళ్ మిలన్ పేరిట న్యూఢిల్లీలో మంగళవారం నిర్వహించిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో నీట్ ప్రశ్నపత్రం లీకేజీ అంశంపై ప్రధాని మోదీ మాట్లాడారని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు విలేకరులకు వెల్లడించారు. "ప్రశ్నపత్రం లీకేజీ అంశం బయటకు వచ్చిన వెంటనే స్పందించిన ప్రభుత్వం దర్యాప్తు చేపట్టి, 13 మందిని అరెస్టు చేసింది విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం కలగకూడదనే ఉద్దేశంతో వెంటనే నీట్ రీఎగ్జామినేషన్ నిర్వహించాం. ఎలాంటి జాప్యం లేకుండా ఫలితాలు కూడా ప్రకటించాం. భవిష్యత్తులో ప్రశ్నపత్రాల లీకేజీలు జరగకుండా కఠిన చర్యలు తీసుకున్నాం. దేశంలోని అత్యుత్తమ న్యాయవాదుల సహకారంతో దోషులకు అత్యంత కఠిన శిక్షలు పడేలా చేయాలి. అప్పుడే ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు పునరావృతం కావు. ప్రశ్నపత్రాల లీకేజీ అనేది ఏ ఒక్క రాష్ట్రానికో, కేంద్ర ప్రభుత్వానికో పరిమితమైన సమస్య కాదు. దేశానికి సంబంధించిన సమస్య. ప్రశ్నపత్రాలు లీక్ చెయ్యడమనేది మహా పాపం, ఘోరం. లీకేజీ ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే పార్టీలకతీతంగా అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు కేంద్రంతో కలిసి పని చేయాలి. లీకేజీలను నివారించేందుకు ఓ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ అంశంలో నిరసనల్లో పాల్గొంటున్న పిల్లలను రెచ్చగొట్టవద్దు. యువతను సరైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత సమాజంపై ఉంది" అని ఎంపీలతో ప్రధాని అన్నారని రిజిజు వెల్లడించారు. కాగా, ఎన్డీయే ప్రభుత్వం వివిధ దేశాలతో చేసుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల(ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్స్) అంశంలో రైతులకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని ప్రధాని పేర్కొన్నారని రిజిజు వెల్లడించారు.

# పంచాయతీ నిధులు పక్కదారి..

**- ఆలస్యంగా వెలుగు చూసిన సర్పంచ్ భర్త నిర్వాహం**






**మన సమాజం/చెన్నూరు:**
భార్య పదవిని ఆసరాగా చేసుకొని గ్రామ పంచాయతీకే ఎగనామం పెట్టిన సర్పంచ్ భర్త, పంచాయతి కార్యదర్శి నిర్వాహం కత్తరశాల గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ప్రతీ నెలా తప్పుడు బిల్లులు రూపొందిస్తూ గ్రామ పంచాయతీ నిధుల నుండి 80వేల నుండి 1లక్ష రూపాయల వరకు నేరుగా సర్పంచ్ భర్త ఖాతాలోకే దారి మళ్ళిస్తున్నారని, ఎంపీడీవో కార్యాలయంలో అదే గ్రామపంచాయతీకి చెందిన ఓ వ్యక్తి కంప్యూటర్ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తుండగా, అతని సహకారంతోనే పంచాయతీ నిధులను సులువుగా పక్కదారి పట్టించినట్లు పేర్కొంటూ వారి తీరుపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేరుకే సర్పంచ్ అయినా గ్రామంలో పెత్తనం ఆమె భర్తే చలాయిస్తూ, తేరగా లక్షలాది రూపాయల ప్రజా ధనాన్ని దోచుకుంటూ సొమ్ము చేసుకుంటున్నాడని, ఈ వ్యవహారం బయట పడితే తన ఉద్యోగానికి ఎక్కడ ఎసరు వస్తుందో అని భయపడి ఇటీవలే ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి మరో మండలానికి బదిలీ చేయించుకున్నాడని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు నిధుల మళ్ళింపు తతంగంపై సమగ్ర విచారణ చేపట్టి, పంచాయతీ నిధుల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# మురుగులోనే ప్రభుత్వ కార్యాలయాలు

**- పడకేసిన పారిశుధ్యం**

**- అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్న దుస్థితి**



**మన సమాజం/చెన్నూరు:**
ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన ప్రభుత్వ కార్యాలయాలే అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. చెన్నూరు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం, పల్లె దవాఖానా, సీడీపీవో కార్యాలయం, అగ్నిమాపక కేంద్రం,వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయం, పల్లె దవాఖాన, పశు వైద్యశాల వంటి ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు మురుగునీటితో నిండిపోయి చెరువును తలపిస్తున్నాయి. ఎక్కడ చూసిన నిల్వ నీరు, బురద, పిచ్చి మొక్కలు దుర్వాసనతో ఆ ప్రాంతం దయనీయంగా మారింది. వర్షపు నీరు రోజుల తరబడి నిలిచిపోవడంతో మురుగునీటిలో, గుంపులు గుంపులుగా పందులు స్వైర విహారం చేస్తున్నాయి. నిల్వ నీటిలో దోమలు విపరీతంగా పెరిగి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నా సంబంధిత అధికారులు మాత్రం, పట్టించుకోవడం లేదని, స్థానికులు మండిపడుతున్నారు. ప్రతిరోజూ ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు, ఉద్యోగులు మురుగునీటిని దాటుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. దుర్వాసన, బురద కారణంగా కార్యాలయాలకు వెళ్లడమే భారంగా మారిందని, వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుబురుగా పెరిగిన గడ్డి వల్ల విషసర్పాలు సంచరించే ప్రమాదం కూడా ఉందని, ఇప్పటికే పాములు కనిపిస్తున్నాయంటూ, ఉద్యోగులు, కాలనీవాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలే ఈ స్థాయిలో ఉంటే సాధారణ ప్రాంతాల పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రశ్నిస్తున్నారు. పారిశుధ్య నిర్వహణ పూర్తిగా గాలికొదిలేయడంతో, కార్యాలయాల చుట్టూ పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగి అపరిశుభ్ర వాతావరణం నెలకొందని, ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖలు వెంటనే స్పందించి నిల్వ ఉన్న మురుగునీటిని తొలగించి, పారిశుధ్య పనులు చేపట్టి, ప్రజలకు, ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# వజ్రం చోరీ.. జైలుశిక్ష..

**సింగపూర్, జూలై 21:**
సింగపూర్‌లో విలువైన వజ్రాన్ని చోరీ చేసిన కేసులో ఇద్దరు భారతీయులకు స్థానిక కోర్టు జైలుశిక్ష విధించింది. చైనాటౌన్‌లోని ఓ నగల దుకాణం నుంచి సుమారు లక్షన్నర డాలర్ల విలువైన వజ్రాన్ని అపహరించిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేయగా, విచారణ అనంతరం శిక్ష ఖరారు చేశారు. ఈ ఘటన సింగపూర్‌లో సంచలనంగా మారింది. దర్యాప్తు వివరాల ప్రకారం, 41 ఏళ్ల మంగ్రోలియా మనోజ్‌కుమార్ కుర్జీభాయ్, 30 ఏళ్ల సెరాసియా మిలన్ రామినిక్‌భాయ్ ముందస్తుగా పథకం రచించి ఈ చోరీకి పాల్పడ్డారు. సూరత్‌లో అసలు వజ్రాన్ని పోలిన 4.95 క్యారెట్ల నకిలీ వజ్రాన్ని తయారు చేయించి, దానిని నోటిలో దాచుకుని సింగపూర్‌కు వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. చైనాటౌన్‌లోని నగల దుకాణానికి వెళ్లిన ఇద్దరూ కొనుగోలు చేస్తున్నట్లు నటిస్తూ సిబ్బందిని మాటల్లో పెట్టారు. ఈ సమయంలో నకిలీ వజ్రాన్ని బయటకు తీసి, అసలు వజ్రంతో చాకచక్యంగా మార్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఒకరు దుకాణ సిబ్బంది దృష్టి మరల్చగా, మరొకరు అసలు వజ్రాన్ని నోటిలో దాచుకుని అక్కడి నుంచి బయటకు వెళ్లిపోయినట్లు అధికారులు తెలిపారు. చోరీ అనంతరం జూలై 19న సింగపూర్‌లోని చాంగీ విమానాశ్రయం ద్వారా దేశం విడిచి వెళ్లేందుకు ఇద్దరూ ప్రయత్నించారు. అయితే దుకాణంలో వజ్రం మాయమైనట్లు గుర్తించిన సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో అప్రమత్తమైన అధికారులు విమానాశ్రయంలో నిఘా ఏర్పాటు చేశారు.చాంగీ విమానాశ్రయం మూడో టెర్మినల్‌లో వలస తనిఖీల కోసం వేచి ఉన్న సమయంలో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో మిలన్ రామినిక్‌భాయ్ వద్ద ఉన్న సంచిలో అసలు వజ్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరినీ కోర్టులో హాజరుపరచగా, కేసు విచారణ చేపట్టింది. విచారణలో నిందితులు పథకం ప్రకారమే చోరీకి పాల్పడినట్లు తేలడంతో స్థానిక కోర్టు మంగ్రోలియా మనోజ్‌కుమార్ కుర్జీభాయ్‌కు రెండేళ్ల జైలుశిక్ష విధించింది.

# బల్కంపేట ఎల్లమ్మకు పట్టువస్త్రాలు..

**కళ్యాణోత్సవంలో పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్**

**గీతా రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు**

**రాష్ట్ర శ్రేయస్సు కోసం అమ్మవారికి ప్రార్థనలు**



**హైదరాబాద్, జూలై 21**
హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణ మహోత్సవంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీమణి గీతా రెడ్డితో కలిసి కళ్యాణోత్సవంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌కు దేవాలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వేద ఆశీర్వచనాలతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు. కళ్యాణోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణోత్సవానికి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుంటున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసిందని, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులు, శివసత్తుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవమైన బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో మంచి వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న వరుణ యాగాలు, ప్రత్యేక పూజల ఫలితంగా దైవానుగ్రహంతో తెలంగాణలో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఈ వర్షాలతో రాష్ట్రం పాడిపంటలతో సస్యశ్యామలంగా మారి రైతాంగం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఐశ్వర్యం వెల్లివిరియాలని మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ప్రార్థించారు. బల్కంపేట ఎల్లమ్మ ఆలయ వైభవాన్ని మరింత పెంపొందించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు కొనసాగిస్తుందని తెలిపారు.


## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను అరెస్ట్ చేయండి..

**కోర్టు ధిక్కరణ కేసులో రంగనాథ్‌ను**

**అరెస్ట్ చేయాలని తెలంగాణ హైకోర్టు ఆదేశాలు..**

**న్యాయవాదుల విజ్ఞప్తితో అరెస్ట్ ఆదేశాల ఉపసంహరణ**






హైదరాబాద్–మల్కాజిగిరి పరిధిలోని లోతుకుంటలో సర్వే నంబర్లు 1, 2లో ఉన్న 40 ఎకరాల భూమిపై గత కొంతకాలంగా ప్రభుత్వానికి, శాంత శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు మధ్య కొనసాగుతున్న వివాదం రెండుసార్లు ప్రభుత్వం ఓడిపోయినా, మూడోసారి సంస్థ యజమానులపై క్రిమినల్ కేసు నమోదు చేసి, భూమిలోకి దౌర్జన్యంగా ప్రవేశించి, ఈ నెల 17వ తేదీన ఫెన్సింగ్ వేసిన హైడ్రా దీంతో హైకోర్టును ఆశ్రయించిన బాధితులు బాధితుల పిటిషన్‌ను విచారిస్తూ, హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెంటనే కోర్టులో హాజరుకావాలనిఆదేశాలు ఇచ్చిన న్యాయమూర్తిదీంతో సాయంత్రం 6:30 గంటలకు కోర్టులో హాజరు అయినా రంగనాథ్ ఈ క్రమంలో "అసలు రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా అనేది ఉందని హైడ్రా మర్చిపోతుందా? ఇష్టారీతిన వ్యవహరిస్తే ఎలా కుదురుతుంది?" అంటూ రంగనాథ్‌పై తీవ్రం గా మండిపడ్డ న్యాయమూర్తిప్రైవేట్ భూమిలోకి వెళ్లొద్దని కోర్టు ఆదేశాలు ఉన్నా కూడా మూడుసార్లు ఆ భూమిలోకి ఎలా ప్రవేశిస్తారు? బాధితులపై క్రిమినల్ కేసు ఎందుకు పెట్టారు?ఆఎఫ్ఐఆర్‌ను వారికి ఎందుకు ఇవ్వలే దు? అంటూ అసహనం కోర్టు చెప్పిన తర్వాత కూడా హైడ్రా తనకు నచ్చిన ట్లు చేయడం అర్థరహితంరంగనాథ్ అలవాటుపడిన నేరస్తుడిలా మారారు, అరెస్ట్ చేయండి అంటూ న్యాయమూర్తి ఆగ్రహం హైడ్రా తరపు న్యాయవాదుల విజ్ఞప్తి మేరకు అరెస్ట్ ఆదేశాలను ఉపసంహరిం చుకుని, కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసిన హైకోర్టు..

## కలెక్టరేటా..? కాంగ్రెస్ పార్టీ కార్యాలయమా..?

**హనుమకొండ కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు**

**హాజరైన మంత్రులు పొంగులేటి, పొన్నం, ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**ప్రభుత్వ కార్యాలయంలో వేడుకలపై వెల్లువెత్తుతున్న విమర్శలు**

**అధికారిక ఐఅండ్‌పీఆర్ గ్రూప్‌లో పోస్ట్.. ఆపై హడావుడిగా డిలీట్**




**హనుమకొండ:** ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు సేవలు అందించే వేదికలు.కానీ, కొందరు ప్రజాప్రతినిధులు వాటిని తమ పార్టీ కార్యాలయాలుగా,వ్యక్తిగత వేడుకల కేంద్రాలుగా మార్చేస్తున్నారు. చట్టాలు, నిబంధనలు అమలు చేయాల్సిన వారే వాటిని తుంగలో తొక్కుతున్న తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.తాజాగా హనుమకొండ కలెక్టరేట్ లో జరిగిన ఓ ఘటన తీవ్ర వివాదాస్పదంగా మారింది.

**నిబంధనలకు పాతర.. కలెక్టరేట్‌లో కేక్ కటింగ్**
హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు లేదా ఇతర ఏ వ్యక్తుల వ్యక్తిగత జన్మదిన వేడుకలు, పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం నిబంధనలకు పూర్తిగా విరుద్ధం. అయినప్పటికీ అధికార పార్టీ నేతలు ఏమాత్రం వెనుకాడకుండా కలెక్టరేట్‌నే వేదికగా చేసుకోవడం గమనార్హం. ఈ వేడుకల్లో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పాటు పలువురు ఇతర కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు. సాక్షాత్తూ మంత్రుల సమక్షంలోనే ఈ ఉల్లంఘన జరగడం అధికారుల, పాలకుల తీరును ప్రశ్నించేలా చేస్తోంది.

**గతంలోనూ రోడ్డు ఆక్రమించి వేడుకలు**
ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఇలా నిబంధనలు ఉల్లంఘించడం కొత్తేమీ కాదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలోనూ ఆయన, ఆంధ్ర అల్లుడు దేవన్ విష్ణురెడ్డితో కలిసి నడిరోడ్డును ఆక్రమించి జన్మదిన వేడుకలు నిర్వహించుకున్నారు. అప్పట్లో ఈ చర్యల వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి సామాన్య ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు ఏకంగా కలెక్టరేట్‌ను ఎంచుకోవడం వారి తీరుకు అద్దం పడుతోంది.

**అధికారిక గ్రూప్‌లో పోస్ట్.. ఆపై డిలీట్!**
ఈ వ్యవహారంలో అధికారుల తీరు మరింత విస్మయం కలిగించింది. వేడుకలకు సంబంధించిన వార్త, ఫోటోలను తొలుత సమాచార, పౌర సంబంధాల శాఖ (ఐ అండ్ పీఆర్) హనుమకొండ అధికారిక గ్రూప్‌లో పోస్ట్ చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాల్సిన ఐఅండ్‌పీఆర్ గ్రూప్‌లో ఒక ప్రైవేట్ జన్మదిన వేడుకల వార్తను వేయడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ కార్యాలయంలో వేడుకలు నిబంధనలకు విరుద్ధమని, ఇది వివాదాస్పదమవుతుందని గ్రహించిన వెంటనే ఆ పోస్ట్‌ను అధికారులు హడావుడిగా తొలగించడం (డిలీట్ చేయడం) విశేషం. అధికార పార్టీ నేతలు ప్రభుత్వ ఆస్తులను, కార్యాలయాలను తమ స్వంత అవసరాలకు వాడుకోవడంపై స్థానికులు, ప్రజా సంఘాల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కంచే చేను మేసిన చందంగా పాలకులే నిబంధనలు ఉల్లంఘిస్తే సామాన్యులకు ఏం సందేశం ఇస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

# అనగనగా అనలాగ్ లైఫ్!




పొద్దున లేవగానే పక్కనున్న ఫోన్ మోగడం.. కళ్లు తెరవకముందే నోటిఫికేషన్లు స్క్రోల్ చేయడం.. ఆఫీస్‌లో ల్యాప్‌టాప్, మధ్యమధ్యలో వాట్సాప్, రాత్రి పడుకునే ముందు.. ఏదోఒక వెబ్‌సిరీస్! చాలామంది జీవితం ఇప్పుడు కేవలం.. స్వైప్‌లు, ట్యాప్‌ల మధ్యే నలిగిపోతున్నది. ఈ డిజిటల్ ప్రపంచం ఇస్తున్న సౌకర్యం కంటే.. అది కలిగిస్తున్న అలసటే ఎక్కువగా భయపెడుతున్నది. అందుకే 2026లో ఒక కొత్త విప్లవం మొదలైంది. అదే 'అనలాగ్ లివింగ్'! స్మార్ట్‌ఫోన్ పక్కన పెట్టి.. మన స్పర్శకు స్పందించే, మన కంటికి నేరుగా కనిపించే నిజమైన అనుభూతుల వైపు జనరేషన్ జెడ్ పరుగులు తీస్తున్నది. అసలు ఇంతకీ ఈ 'అనలాగ్ లివింగ్' ఏంటి? నలాగ్ విప్లవంలో భాగంగా ఇప్పుడు సోషల్ మీడియాలో 'అనలాగ్ బ్యాగ్స్' తెగ ట్రెండ్ అవుతున్నాయి. వినడానికి వింతగా ఉన్నా, ఇవి ఇప్పుడు ఒక స్టేటస్ సింబల్. ఈ బ్యాగుల ముఖ్య ఉద్దేశం ఏంటంటే.. మీ స్మార్ట్ ఫోన్‌ని చేతికి అందనంత దూరంలో ఉంచడం. మరి ఫోన్ లేకపోతే బోర్ కొట్టదా!? అంటే.. అక్కడే ఉంది అసలు మ్యాజిక్. ఈ బ్యాగులో పెయింటింగ్ కిట్స్, నవలలు, చిన్నపాటి పజిల్స్, డైరీలు, అల్లికల సామాగ్రి ఉంటాయి. ఎక్కడైనా వెయిట్ చేయాల్సి వచ్చినప్పుడు ఫోన్ తీసి 'డూమ్ స్క్రోలింగ్' చేయకుండా.. వీటితో కాలక్షేపం చేస్తారన్నమాట. ఇది మన మెదడుకి ఒక రకమైన ప్రశాంతతను ఇస్తుంది.

కాన్సెప్ట్ : ఫోన్‌ని లోపల పెట్టి, చేతికి అందుబాటులో నవలలు, జెంగా గేమ్స్, లెగో సెట్స్ లేదా డైరీలను ఉంచుకోవడం. వెయిటింగ్ రూమ్స్ లేదా ప్రయాణాల్లో ఉన్నప్పుడు బోర్ కొడితే ఫోన్ తీయకుండా, వీటితో క్వాలిటీ టైమ్ గడపవచ్చు.

### మెదడుకి ఎంత మేలు?

స్మార్ట్‌ఫోన్ స్క్రీన్ ఇచ్చే వెలుగు కంటే, మిత్రులతో కలిసి ఆడే లూడో బోర్డు ఇచ్చే ఆనందం చాలా గొప్పది. అందుకే 10 నిమిషాల్లో డెలివరీ వచ్చే క్విక్ కామర్స్ యాప్స్ మనల్ని బద్ధకస్తులుగా మార్చేస్తున్నాయని భావిస్తూ.. చాలామంది ఇప్పుడు స్వచ్ఛందంగా లోకల్ మార్కెట్ల వైపు అడుగులు వేస్తున్నారు. కూరగాయల కోసం, చిన్నచిన్న వస్తువుల కోసం నేరుగా కిరాణా కొట్టుకు వెళ్లడం వల్ల మన చుట్టూ ఉన్న ప్రపంచం కనిపిస్తుంది, నలుగురితో మాట్లాడతాం. ఇవే మనల్ని ఒత్తిడి నుంచి కాపాడతాయి. నిరంతరం నోటిఫికేషన్లు, డేటా వెల్లువలో మన నాడీవ్యవస్థ ఎప్పుడూ అలర్ట్‌గా ఉండి అలిసిపోతున్నది. వస్తువులను ఫిజికల్‌గా తాకడం.. అంటే, పుస్తకం పేజీలు తిప్పడం, పెన్‌తో పేపర్ మీద రాయడం వల్ల మన మెదడు 'ప్రెజెంట్ మూమెంట్'లో ఉంటుంది. ఇది యాంగ్జయిటీని తగ్గించడమే కాకుండా, డిజిటల్ మీడియా దెబ్బతీసిన మన

### ఏకాగ్రతను మళ్లీ పునరుద్ధరిస్తుంది

ప్రెజెంట్ మూమెంట్ : పేపర్ మీద పెన్నుతో రాయడం, ఒక పుస్తకం పేజీలు తిప్పడం వల్ల మెదడు ప్రస్తుతం జరుగుతున్న పనిపై ఎక్కువ ఫోకస్ చేస్తుంది.

స్ట్రెస్ రిలీఫ్ : నోటిఫికేషన్ల వెల్లువ తగ్గడం వల్ల నాడీవ్యవస్థ ప్రశాంతంగా ఉంటుంది. ఇది యాంగ్జయిటీని తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తుంది.

### ఎలా మొదలుపెట్టాలి?

అనలాగ్ లివింగ్‌లోకి మారడం అనేది ఒకేరోజులో జరిగిపోయే పనికాదు. దీనికోసం నిపుణులు కొన్ని సింపుల్ టిప్స్ సూచిస్తున్నారు. రాత్రి పడుకోవడానికి గంట ముందే ఫోన్ ఆపేసే 'డిజిటల్ సన్‌సెట్' పాటించడం. ఫోన్‌లో క్యాలెండర్ బదులు ఒక పేపర్ డైరీలో పనులు రాసుకోవడం, ఎప్పుడూ యూపీఐ పేమెంట్స్ కాకుండా అప్పుడప్పుడూ నగదు వాడటం వంటివి.. మనల్ని మళ్లీ రియల్ వరల్డ్‌కి కనెక్ట్ చేస్తాయి. అల్లికలు, వంట చేయడం, పెయింటింగ్ వంటి కొత్త హాబీలను నేర్చుకోవడం వల్ల.. మనకు మనమే ఒక క్వాలిటీ టైమ్ ఇచ్చుకోగలుగుతాం.

డిజిటల్ సన్‌సెట్ : నిద్రపోవడానికి ఒక గంట ముందే అన్ని స్క్రీన్లను ఆఫ్ చేయండి.

వినైల్/సీడీ మ్యూజిక్ : పాటలను స్కిప్ చేయకుండా వినడం అలవాటు చేసుకోండి.

పేపర్ ప్లానర్ : మీ రోజువారీ పనులను డైరీలో రాసుకోండి.

ఆఫ్‌లైన్ కమ్యూనిటీస్ : బోర్డ్ గేమ్‌క్లబ్స్, బుక్ రీడింగ్ సెషన్స్‌లో నేరుగా పాల్గొనండి. చివరగా, 'అనలాగ్ లివింగ్' అంటే టెక్నాలజీని వదిలేయడం కాదు.. అది మనల్ని పాలించకుండా చూసుకోవడమే! అందుకే, సాంకేతికతతో స్మార్ట్‌గా ఉంటూనే.. 'అనలాగ్'తో హెల్తీగా జీవించండి!

# తిరగబడితే.. తిప్పికొడదాం

## క్యాన్సర్ రోగులకు కార్-టి సెల్ థెరపీ కవచం

శరీరంలోకి క్యాన్సర్ ప్రవేశించిందంటే ఇక మరణ శాసనమే. ఎన్ని అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చినా అవన్నీ తాత్కాలిక ఉపశమనమే అందిస్తున్నాయి. ఈ క్యాన్సర్ వ్యాధులను ప్రారంభ దశలో గుర్తించి, సరైన చికిత్స అందిస్తే రోగం ముదరకుండా నియంత్రించవచ్చు. కానీ, శరీరంలో నుంచి పూర్తిగా నిర్మూలించలేం. ముఖ్యంగా బ్లడ్ క్యాన్సర్ వ్యాధుల విషయానికి వస్తే ప్రస్తుతం అందుబాటులో ఉన్న చికిత్సల ద్వారా వ్యాధులను కొంత వరకు మాత్రమే నియంత్రించవచ్చు. ఒకసారి చికిత్స అందించిన తర్వాత క్యాన్సర్ వ్యాధి మళ్లీ మళ్లీ తిరగబడే అవకాశాలు ఎక్కువ. ఇలాంటి రోగులకు కార్–టి సెల్ థెరపితో చెక్ పెట్టవచ్చంటున్నారు క్యాన్సర్ వైద్యనిపుణులు. క్యాన్సర్ చికిత్స తరువాత మళ్లీ వ్యాధి తిరగబడిన రోగులకు ఈ చికిత్సా విధానం ద్వారా జీవిత కాలాన్ని పెంచవచ్చు అని భరోసా ఇస్తున్నారు. అసలు ఈ కార్–టి సెల్ థెరపీ అంటే ఏంటి? ఈ చికిత్సా విధానంతో ఏయే క్యాన్సర్ రోగులకు చికిత్స అందించవచ్చు ? ఈ చికిత్స ద్వారా రోగులకు ఆరోగ్యపరంగా కలిగే లాభాలేంటి? తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం. ప్రస్తుతం భారత్‌లో కొన్ని రకాల బ్లడ్ క్యాన్సర్‌లకు మాత్రమే కార్–టి సెల్ థెరపీతో చికిత్స అందించేందుకు అనుమతి ఉంది. మిగిలిన బ్లడ్ క్యాన్సర్లకు సంబంధించి ఇంకా క్లినికల్ ట్రయల్స్ జరుగుతున్నాయి. బ్లడ్ క్యాన్సర్‌లను పరిశీలిస్తే ప్రధానంగా ఇవి రెండు రకాలు. ఒకటి లింఫోమా కాగా, రెండోది లుకేమియా క్యాన్సర్.

**లింఫోమా క్యాన్సర్స్ లింఫోమా క్యాన్సర్లు రెండు రకాలు.**

**1. హాడ్కిన్ లింఫోమా**

**2.నాన్-హాడ్కిన్ లింఫోమా**

ఈ నాన్ హాడ్కిన్ లింఫోమాలో మళ్లీ రెండు రకాల క్యాన్సర్స్ ఉన్నాయి. అందులో 1. బి–నాన్ హాడ్కిన్ లింఫోమా 2. టి–నాన్ హాడ్కిన్ లింఫోమా.

**లుకేమియా క్యాన్సర్స్**

లుకేమియా క్యాన్సర్స్ రెండు రకాలు. అందులో 1.అక్యూట్ లింఫోబ్లాస్టిక్ లుకేమియా (ఏఎల్ఎల్). 2.అక్యూట్ మైలాయిడ్ లుకేమియా 1. అక్యూట్ లింఫోబ్లాస్టిక్ లుకేమియాలో మళ్లీ రెండు రకాలు ఉన్నాయి. అవి బి–అక్యూట్ లింఫోబ్లాస్టిక్ లుకేమియా, టి–అక్యూట్ లింఫోబ్లాస్టిక్ లుకేమియా. అయితే ప్రస్తుతం మన దేశంలో కార్–టి సెల్ థెరపీతో అక్యూట్ లింఫోబ్లాస్టిక్ లుకేమియాకు చెందిన బి–అక్యూట్ లింఫోబ్లాస్టిక్ లుకేమియా (బి–ఏఎల్ఎల్), లింఫోమా క్యాన్సర్‌కు చెందిన బి–నాన్ హాడ్కిన్ లింఫోమా (బి–ఎన్‌హెచ్ఎల్) క్యాన్సర్ వ్యాధులకు మాత్రమే చికిత్స అందుబాటులో ఉంది.

**కార్-టీ సెల్ థెరపి అంటే..**

చైమరిక్ యాంటీజెన్ రిసెప్టర్– టి సెల్ థెరపీ (కార్–టి సెల్ థెరపీ).. దీనినే జీన్ థెరపీ అని కూడా అంటారు. ఈ విధానంలో రోగిలోని క్యాన్సర్ కణాలకు వ్యతిరేకంగా రోగి ఇమ్యూనిటీని (టీ–సెల్స్) ఉత్తేజిత పరిచి వాటిని తిరిగి రోగికి ఎక్కిస్తారు. అంటే ఇమ్యూనిటీలో జన్యుమార్పిడి చేస్తారన్నమాట. ప్రస్తుతం ఈ కార్–టి సెల్ థెరపీతో బి–అక్యూట్ లింఫోబ్లాస్టిక్ లుకేమియా (బి–ఏఎల్ఎల్), బి–నాన్ హాడ్కిన్ లింఫోమా (బి–ఎన్‌హెచ్ఎల్) వంటి రక్త క్యాన్సర్లకు చెక్ పెట్టవచ్చు.

**విదేశాల కంటే తకువ ఖర్చుతో...**

అతి ఖరీదైన ఈ కార్–టి సెల్ థెరపీని మన దేశంలో అతి తక్కువ ఖర్చుతో అందిస్తున్నారు. అమెరికా, యూరప్ దేశాల్లో ఈ చికిత్సకు సుమారు 4 లక్షల డాలర్లకు పైగా అంటే దాదాపు రూ. 3.5 కోట్లు ఖర్చవుతుంది. అయితే భారత్‌లో మాత్రం రూ. 30 లక్షల నుంచి రూ. 40 లక్షల మధ్య ఖర్చవుతుంది. దేశీయ పరిశోధనలు, స్థానిక తయారీ, సరళమైన ప్రక్రియల కారణంగా విదేశాల కంటే మన దేశంలో అతి తక్కువ ఖర్చుతో కార్–టి సెల్ థెరపీ చికిత్స అందుబాటులో ఉంది. 2023లో తొలిసారి అనుమతులు2023 అక్టోబర్‌లో ఇమ్యునోక్ట్ (ఐఐటి బాంబేలో ఇన్క్యూబేటెడ్ స్టార్టప్), టాటా మెమోరియల్ సెంటర్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన నెక్స్ కార్19కు దేశంలో తొలి దేశీయ కార్–టి సెల్ థెరపీ చికిత్సగా అనుమతి లభించింది. పునరావృతమైన అంటే చికిత్స అందించిన తరువాత మళ్లీ తిరగబడిన, సంప్రదాయ చికిత్సలకు లొంగని బి–ఏఎల్ఎల్, బి–ఎన్‌హెచ్ఎల్ క్యాన్సర్‌తో బాధపడే రోగులకు ఈ కార్–టి సెల్ థెరపితో చెక్ పెట్టవచ్చు.

**2025లో రెండో అనుమతి**

2025 జనవరిలో ఇమ్యూనీల్ థెరప్యూటిక్స్ అభివృద్ధి చేసిన 'క్వార్టెమీ' అనే చికిత్సా పద్ధతికి అనుమతి లభించింది. ఈ పద్ధతి ద్వారా పెద్దవారిలో వచ్చే బి–ఎన్‌హెచ్ఎల్ వ్యాధిగ్రస్తులకు చికిత్స చేయవచ్చు. ఈ చికిత్సపై నిర్వహించిన ఫేజ్–2 క్లినికల్ ట్రయల్స్‌లో 83.3 శాతం స్పందన కనిపించింది. భారత్‌లో నిర్వహించిన క్లినికల్ అధ్యయనాల్లో కార్–టి చికిత్సకు 70 నుంచి 80 శాతం పైగా స్పందన రేటు నమోదైంది. పాత సంప్రదాయ చికిత్సలతో కేవలం 10– 20 శాతం మాత్రమే స్పందన కనిపించింది. అందుకని పాత చికిత్సా పద్ధతుల కంటే కార్–టి సెల్ థెరపీ అత్యంత మెరుగైన చికిత్సా విధానంగా చెప్పవచ్చు. స్థానికంగా అభివృద్ధి చేసిన 'హ్యూమనైజ్డ్ కార్–టి డిజైన్' వల్ల సైటోకైన్ రిలీస్ సిండ్రోమ్ వంటి తీవ్రమైన దుష్ప్రభావాలు కూడా తగ్గాయి.

**చిగురిస్తున్న ఆశలు**

ఇప్పటికే మల్టిపుల్ మైలోమా వంటి బ్లడ్ క్యాన్సర్లలో మూల కారకమైన బీసీఎంఏకు లక్ష్యంగా అందిస్తున్న కార్–టి సెల్ చికిత్సలు భారత్‌లో క్లినికల్ ట్రయల్ దశలో ఉన్నాయి.

# హల్దీదూద్ ఎప్పుడు తాగాలి?



ఆరోగ్యానికి పసుపు పాలు ఎంతో మేలు చేస్తాయని చెబుతున్నారు నిపుణులు. పాలు, పసుపు, నల్ల మిరియాలు, అల్లం, దాల్చిన చెకతో తయారు చేసిన హల్దీ దూద్ ఏ కాలానికైనా అనువైన పానీయమే! ఇందులో ఆరోగ్యానికి సాయపడే యాంటి ఇన్‌ఫ్లమేటరీ, యాంటి మైక్రోబయల్ లక్షణాలు ఉండటంతో మన శరీరానికి కావాల్సిన వెచ్చదనం లభిస్తుంది. సాధారణ జలుబు, ఫ్లూతో బాధపడేవారికి... కీళ్ల నొప్పులు, కండరాల సమస్యతో ఇబ్బందిపడే వృద్ధులకు హల్దీ దూద్ ఉపశమనం కలిగిస్తుంది. అయితే చాలామంది నిద్రపోయే ముందు పసుపు పాలు తాగుతుంటారు. అలా చేయడం ప్రమాదకరమని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే అధిక కేలరీలు ఉండే హల్దీ దూద్ తాగి పడుకుంటే జీర్ణవ్యవస్థకు అంతరాయం ఏర్పడుతుందట. పాలు తాగిన వెంటనే పడుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలూ తలెత్తుతాయి. రాత్రి భోజనం కడుపు నిండుగా తిన్నతర్వాత పాలు తాగడం వల్ల ఉబ్బరం పెరుగుతుంది. వీలైతే రాత్రి భోజనానికి ముందు పాలు తాగడం మంచిది. దీనివల్ల ఆహారాన్ని కూడా మితంగా తీసుకున్నవాళ్లమవుతాం. భోజనం తర్వాత వెంటనే పాలు తాగకుండా కనీసం ఒకటి రెండు గంటల తర్వాత వెచ్చని పసుపు పాలను తక్కువ మోతాదులో తీసుకోవాలి. ఇందులో చకెరను నివారించడం ఎంతో ముఖ్యం. అప్పుడే జీర్ణక్రియపై ఒత్తిడి తగ్గుతుంది.

# ఏఐతో ముందస్తు గుర్తింపు



రొమ్ము క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడంలో కృత్రిమ మేధ అద్భుతంగా పనిచేస్తున్నది. రేడియాలజిస్టులపై పనిభారాన్ని తగ్గించడంతోపాటు ఫలితాలను మెరుగుపరచడంలోనూ సాయపడుతున్నది. స్వీడన్‌లోని లండ్ యూనివర్సిటీ పరిశోధకులు నిర్వహించిన తాజా అధ్యయనం.. ఈ విషయాలను వెల్లడించింది. ఇందుకు సంబంధించిన వివరాలను 'ది లాన్సెట్' ప్రచురించింది. పరిశోధనలో భాగంగా, స్వీడన్‌కు చెందిన లక్ష మంది మహిళలకు రొటీన్ మామోగ్రఫీ స్క్రీనింగ్ నిర్వహించారు. సాధారణ పద్ధతి కంటే ఏఐ వాడకం వల్ల రొమ్ము క్యాన్సర్ గుర్తింపు 29 శాతం పెరిగినట్లు ఈ సందర్భంగా గుర్తించారు. ఇంటర్వెల్ క్యాన్సర్లు (రెండు స్క్రీనింగ్‌ల మధ్య బయటపడే ప్రమాదకర క్యాన్సర్లు) 12 శాతం తగ్గినట్లు వెల్లడించారు. ముఖ్యంగా వ్యాప్తిచెందే అవకాశం ఉన్న కొన్నిరకాల క్యాన్సర్లను ప్రారంభదశలోనే గుర్తించడంలో కృత్రిమ మేధ మెరుగైన ఫలితాలను ఇచ్చినట్లు పరిశోధకులు చెబుతున్నారు. అంతేకాకుండా.. రేడియాలజిస్టుల పనిభారాన్ని తగ్గించడంలోనూ కృత్రిమమేధ సాయపడుతున్నదని అంటున్నారు. సాధారణంగా మామోగ్రఫీ స్క్రీనింగ్‌ను ఇద్దరు రేడియాలజిస్టులు విశ్లేషించాల్సి ఉంటుంది. అయితే ఏఐని ఉపయోగించడం ద్వారా రేడియాలజిస్టుల పనిభారం 44 శాతం వరకూ తగ్గిందట. తక్కువ రిస్క్ ఉన్న కేసులను నేరుగా ఒక రేడియాలజిస్టుకు, అనుమానాస్పదంగా ఉన్న కేసులను ఇద్దరు నిపుణులకు పంపడం ద్వారా సమయం ఆదా అయ్యింది. ఏఐలోని సాంకేతికత మామోగ్రామ్ చిత్రాలను కొన్ని సెకన్లలోనే స్కాన్ చేస్తుంది. అసాధారణంగా, గడ్డలు ఉన్న ప్రాంతాలను హైలైట్ చేస్తుంది. ఇది మానవ కళ్లు గుర్తించలేని అతి సూక్ష్మమైన మార్పులను కూడా పసిగడుతుంది. దాంతో, వ్యాధిని ముందస్తుగా గుర్తించి.. మరింత వేగంగా, సమర్థంగా చికిత్స అందించే అవకాశం ఉంటుందని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.